క్లుప్తంగా

పెండింగ్ చలానాలు చెల్లించాలి

కొనకనమిట్ల: మండలంలో వాహనాల పెండింగ్ బకాయిల చలానాలను వెంటనే చెల్లించాలని ఎస్‌ఐ టి.రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో పలు వాహనాలకు సంబంధించిన బకాయిలు, ట్రాఫిక్ చలానాలను ఏపీ పోలీస్ యాప్ లేదా, మీ సేవా, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా బకాయిలు చెల్లించ వచ్చన్నారు. బకాయిలు చెల్లించకుండా ఉంటే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తసుకుంటామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు.

12న సీపీఎం ప్రజాపోరు సదస్సు

మార్కాపురం టౌన్: సీపీఎం ప్రజాపోరు సదస్సును మార్కాపురం పట్టణం ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు డి.సోమయ్య శనివారం తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరై మాట్లాడతారన్నారు. సదస్సులో వెలుగొండ ప్రాజెక్టుకు నీటిని వెంటనే విడుదల చేయాలి, ప్రాజెక్టుకు బడ్జెట్‌లో 2 వేల కోట్లు కేటాయించాలి, వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌ఆర్‌ప్యాకేజీ ఇవ్వాలి, మెడికల్ కాలేజి తరలింపు నిలుపుదల చేయాలి, మార్కాపురం జిల్లా ఏర్పాటు ఎప్పుడు, ఆటంకం ఏమిటి, విద్యుత్ చార్జీలు పెంపుదల, ఇసుక, మద్యం, మహిళలపై దాడులు తదితర అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు వెలుగొండ నిర్వాసితులు, అన్ని తరగతుల ప్రజలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వర్క్‌షాపులను విద్యార్థులు ఉపయోగించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీధర్

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు మెళకువలను వివరించేందుకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులను ఉపయోగించుకోవాలని కిట్స్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య కోరారు. శనివారం కళాశాలలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ కె.ప్రమోద్, శివప్రియ, జి.శ్రీధర్‌లు పాల్గొని విద్యార్థులకు టెర్రాఫాం, గిట్బు, డెవాప్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డాకర్ తదితర సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక టెక్నాలజీని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. హెచ్‌ఓడీలు అనీల్‌కుమార్, అమృతవల్లి, రంగనాయకులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్


పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కొమరోలు: మండలంలోని పోలింగ్ బూత్‌లలో శనివారం ఓటర్ల మార్పులకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌ఓలు ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలను తీసుకున్నారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి తాటిచెర్లలోని పోలింగ్ బూతును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఓటర్ల వివరాలకు సంబంధించిన సమాచారాన్ని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు.


దుకాణాల ముందు కూర్చున్న విద్యార్థులు

విద్యార్థుల అవస్థలు

బేస్తవారిపేట: ఆర్టీసీ బస్ సమయాన్ని మార్చడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బేస్తవారిపేటలోని జెడ్పీ బాలికల, జెడ్పీ బాలుర హైస్కూల్, ప్రైవేట్ పాఠశాలల్లో పెద్ద ఓబినేనిపల్లె, మల్లాపురం, గొల్లపల్లెకు చెందిన 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సాయంత్రం 5 గంటలకు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు 6.30-7.00 గంటల వరకు ఆర్టీసీ బస్ లేకపోవడంతో బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. గతంలో 5-5.30 గంటల మధ్య ఉన్న బస్ సమయాన్ని మార్చడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు పాఠశాలలు వదిలే సమయానికి బస్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిలబడేందుకు చోటేదీ?

బస్ షెల్టర్ లేకపోవడంతో బస్టాండ్ ఆవరణలో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిలబడేందుకు వసతి లేకపోవడంతో దుకాణాల ముందు గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం గుంపులు గుంపులుగా పిల్లలు దుకాణాల ముందు చేరడంతో దుకాణదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. హైవే నిర్మించేటప్పుడు బస్‌షెల్టర్ నిర్మిస్తారని ఎదురుచూసిన మండల ప్రజలకు నిరాశే మిగిలింది. గతంలో అనేకసార్లు సబ్‌కలెక్టర్ త్వరలో బస్‌షెల్టర్ నిర్మిస్తామని, స్థలాన్ని కూడా పరిశీలించారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు.

● ఆలయాల్లో కార్తీక సందడి

భక్తి పరవశం

కొనకనమిట్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ


గొట్లగట్టులో మహిళల కార్తీక పూజలు

మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు..

ఆరనీకు మా ఈ దీపం..కార్తీక దీపం

ఆరనీకు మా ఈ దీపం కార్తీక దీపం అంటూ మహిళలు పెద్దెత్తున ఆలయాల్లో విశేష పూజలు చేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కోటి సోమవారం సందర్భంగా తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయల్లో పూజలు చేశారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి మహిళలు వేకువ జామునే తలంటి స్నానాలు చేసి, గ్రామంలోని దేవతలకు పూజలు నిర్వహించి చేపట్టే పనుల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగే విధంగా చూడాలని దేవతలను వేడుకుంటున్నారు. గొట్లగట్టు, కొనకనమిట్ల, రేగడపల్లి, పెదారికట్ల, ఎదురాళ్లపాడు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాలలోని


రేగడపల్లి: అలంకరణలో శ్రీవారు

ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. పలువురు శ్రీశైలం, భైరవకోన, రామతీర్థం వంటి ఆలయాలకు తరలివెళ్లారు.

శివాలయంలో భక్తుల సందడి

పొదిలి: పవిత్ర కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా స్థానిక శ్రీనిర్మమహేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జామున 3 గంటల నుంచే భక్తులు ఆలయానికి వచ్చారు. శివుని దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్నారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. జమ్మిచెట్టు కింద, ధ్వజ స్తంభం వద్ద, ఆలయం ఆవరణ మొత్తం దీపారాధనలు చేశారు. నాగదేవతలకు, నిమ్మవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు దీక్షలు తీసుకున్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

పొదిలి: జిల్లాలోని పెండింగ్ ప్రాజక్టులకు, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు, జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ సమావేశం జరిగింది. కొండారెడ్డి మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని కరువు నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన వెలుగొండ ప్రాజక్టు పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వాలన్నారు. పొదిలి మండలాన్ని వెలుగొండ ప్రాజక్టు పరిధిలో చేర్చాలన్నారు. జిల్లాలోని గుండ్లకమ్మ, పాలేటిపల్లి, గుండ్లమోటు, మొగిలిగుండాల, యర్ర ఓబనపల్లి, పీబీ చానల్ తదితర సాగునీటి ప్రాజక్టులకు నిధులు ఇవ్వాలన్నారు. దొనకొండలో పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు తగిన నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. ట్రిపుల్ ఐటీ, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నిర్మాణానికి నిధులు కేటాయించటంతో పాటు ఒంగోలు రిమ్స్, మార్కాపురం మెడికల్ కాలేజీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను పూర్తి నిర్మాణం కోసం కేంద్రంతో మాట్లాడి నిధులు సాధించాలన్నారు. ఒంగోలు, గిద్దలూరు, చీమకుర్తి, పొదిలి, కనిగిరి, దర్శి మున్సిపాలిటీలకు రక్షిత మంచినీటి పథకాల కోసం నిధులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు వచ్చేలా చూడాలన్నారు. ప్రకటించిన హామీల అమలుకు అవసరమైన ఉత్తర్వులు, గ్రాంట్లు తీసుకరావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.రమేష్, స్థానిక నాయకులు నర్రా వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలి

మార్కాపురం: కష్టాల్లో ఉన్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని పెండింగ్‌లో ఉన్న పంటల బీమా, పెట్టుబడి రాయితీలను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన రైతులు కరువు, అధిక వర్షాలతో పంట నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఇంతవరకూ పరిహారం విడుదల చేయలేదన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సీజన్‌లోనే 11 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని కొండారెడ్డి పేర్కొన్నారు.

అర్హులు ఓటర్లుగా నమోదు కావాలి


పెదారికట్లలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్


గొల్లపల్లిలో ఓటరు నమోదు కార్యక్రమం

పొదిలి రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎంవీ కృష్ణారెడ్డి కోరారు. శనివారం పొదిలి మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 భాగంగా ఓటరు నమోదు, సవరణలు పకడ్బందిగా నిర్వహించాన్నారు. ఈ నెల 9,10,23,24వ తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్లకు అందుబాటులో ఉంటారన్నారు. ఫారం-6 ఓటరు నమోదు, ఫారం-7 తొలగింపు, ఫారం-8 మార్పు అవసరాలు ఓటరు నమోదు గురించి వివరించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి చోట ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనకనమిట్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు గ్రామాల్లో సంబంధించిన బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఆవుల సురేష్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు, పరిశీలన శిబిరాలను ఆయన పరిశీలించారు. పెదారికట్ల, గొట్లగట్టు, చినారికట్ల, గరిమినపెంట గ్రామాల్లోని ఓటరు కేంద్రాలను పరిశీలించి అక్కడి బీఎల్‌ఓలతో మాట్లాడి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 10, 23, 24 తేదీల్లో అన్నీ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపడతామన్నారు. అర్హులైన వారు కొత్త ఓటు హక్కు కోసం ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో తప్పులు ఉంటే సవరణలు చేసుకునేందుకు ఫారం-8, తొలగింపులకు ఫారమ్-7 దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఓటు హక్కు కలిగిన వారు కొత్తగా దరఖాస్తులు చేసుకునే విధంగా అలాగే ఓటు సవరణలు చేసుకునేందుకు దరఖాస్తులు పెట్టుకునే విధగా బీఎల్‌ఓలు చూడాలన్నారు.

రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ కల్పించాలి

గిద్దలూరు రూరల్: రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ కల్పించాలని ప్రకాశం జిల్లా రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి రాయల మాలకొండయ్య కోరారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం రజకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులు పనులు లేకపోవడంతో వలసలు వెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో రజకులు అత్యాచారాలకు, భూదోపిడీలకు, అక్రమ కేసులకు, దౌర్జన్యాలకు గురవుతున్నారన్నారు. రజకులను ఆర్థికంగా ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ కల్పించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం కన్వీనర్‌గా దొడ్డి పుష్ప, కో కన్వీనర్‌గా శిరివెళ్ల కుమారి, రమణమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రజక వృత్తిదారులు స్వర్ణ, దద్దనాల శ్రీను, చిన్నక్క, రంగ లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాలకొండయ్య

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు


పుష్పాలు తీసుకొస్తున్న ఉభయదాతలు


తిలకిస్తున్న భక్తులు

పొదిలి: స్థానిక దర్శి రోడ్డు శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం హోమాలు, ప్రత్యేక పూజలు, శ్రీపుష్ప యాగం, ద్వాదశ ఆరాధన, చక్రస్నానం, అన్న సమారాధన జరిగింది. ఉభయదాతలు మాగులూరి సుధాకరరావు, అనూరాధ దంపతులను మేళ తాళాలతో ఆహ్వానించి వారిచే ప్రత్యేక పూజలు చేయించారు. పుష్పాభిషేకం, చక్రస్నానం కార్యక్రమాలను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఉభయదాతలను ఆలయ కమిటీ సభ్యులు పట్టు వస్త్రాలతో సత్కరించారు. నారాయణం మురళీ కృష్ణమాచార్యులు, దీవి శ్రీకాంత్ భట్టర్, వై.రుషీకేశవాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు, మేడా నరసింహారావు ఉత్సవాలను పర్యవేక్షించారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామికి శాంతి పూజలు


చెన్నకేశవస్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవ స్వామి వారికి ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగమాచార్యులు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అర్చకుడు అరుణ్‌స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు చెన్నకేశవ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలను నెమరువేసుకున్నారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులను పంచుకుని ఆనందంగా గడిపారు. వజ్రోత్సవం ఘనంగా నిర్వహించినందుకు ప్రస్తుత హెచ్‌ఎం సుధాకర్, సిబ్బందిని అభినందించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు సన్మానించారు. మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె ఎంపీయూపీ స్కూల్, ముండ్లపాడు లోని ఎంపీయూపీ స్కూల్, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ బూత్‌లను స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. బూత్ లెవల్ అధికారులకు వారి విధులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామనారాయణరెడ్డి,వి.ఆర్‌ఓ వై.పి.రంగయ్యయాదవ్, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ అజెండా

మార్కాపురం టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యుటీఎఫ్ ముందుంటుందని జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పెద్దారవీడు మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఆ మండల శాఖ అధ్యక్షుడు వై.పాపయ్య అధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ మన ఉద్యమ నేతలు దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి, మైనేని వెంకటరత్నం, చెన్నుపాటి లక్ష్మయ్యల త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులు ఎన్నో రాయితీలు పొందుతూ ఉత్తమ జీవితాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. వారి సేవలు ఉపాధ్యాయులు ఎన్నటికీ మరవరన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి మాట్లాడుతూ 117 జీవోతో ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. జీవోను రద్దు చేయాలని, బదిలీలు, ప్రమోషన్‌లు నిర్వహించాలని, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ముఖ్య అతిథులు మాట్లాడారు. పెద్దారవీడు మండల అధ్యక్షుడిగా బట్టగిరి చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాధ్యక్షుడిగా ఎస్.రజనీకాంత్, సహాధ్యక్షురాలిగా పి.రజనీ, కోశాధికారిగా కేపీ శ్రీనివాసులు, మహిళ కమిటీ కన్వీనర్‌గా ఎస్.మహాలక్ష్మిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి బాబుల్ నాయక్ వ్యవహరించారు. యూటీఎఫ్ శాఖ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా 50 సంవత్సరాల్లో రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు ఉమామహేశ్వరి, చిన్నస్వామి, ప్రభాకర్, శ్రీరాములు, వి.రాజేష్, చలమయ్య, మార్కాపురం, తర్లుపాడు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులతో యూటీఎఫ్ నాయకులు

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం


కంభంలో గ్రామోత్సవం


భక్తుల కోలాటం

కంభం: గుండా ఆంజనేయస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి కంభంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంకాళమ్మ గుడి వద్ద నుంచి చౌకొసెంటర్, జామియా మసీదు సెంటర్, మీదుగా ఆంజనేయ స్వామి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉర్దూ భాషాభివృద్ధికి సహకరించాలి

మార్కాపురం: ఉర్దూ భాషాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (రూటా) జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా కోరారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, ఉర్దూ రచయిత డాక్టర్ మహ్మద్ అల్లామా ఇక్బాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రూటా అసోసియేట్ ప్రెసిడెంట్ సమీవుల్లా బాషా మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ఉర్దూ ఆవశ్యకత, కవులు చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికారిక భాషగా ఉందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సహకరించాలని కోరారు. జాతికి ఏకం చేసే భాష ఉర్దూభాష అన్నారు. సారే జహచే అచ్చ గీతాన్ని ఆలపించారు. అన్వర్‌బాషా, సయ్యద్ సమీవుల్లా, పఠాన్ ఇదయతుల్లా ఖాన్, షేక్ బురానీపీరా, షేక్ ఇబ్రహీం పఠాన్ అబ్దుల్ వాహిద్‌ఖాన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఉర్దూ ఉపాధ్యాయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుమ్మరాం కట్ట సెంటర్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సైడు కాలువల పై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని స్థానిక కమిషనర్ డి.వెంకటదాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే 13 వ తేదీ నగర పంచాయతీ వారు కాలువల పై ఉన్న ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపడతారని హెచ్చరించారు.